
# రాక్షస నీడ

పులుగు శ్రీనివాస్



స్టార్‌టివిలో ఏదో డ్రాకులా..

ప్రియునివేషంలో ఓ అమ్మాయిని క్రూరంగా హతమారుస్తోంది. దాన్ని చూసి ఒళ్ళు జలదరించింది. బుర్రంతా భయంతో నిండుకుంది. కడుపులో అబార్షన్... శరీరమంతా నీరసం ఆవరించింది. శక్తినంతా ఎవరో హరిస్తున్నట్లు, రక్తాన్నంతా ఏదో రాక్షసి లాగేస్తున్నట్టు బాధపడసాగాను. వీటికి తోడు తడక చాటు గదిలో ఒక్కతినే..

ముందు హాల్లో అమ్మా బాపు పడుకున్నారు. ఊ.. అంటే పలుకుతారు. కానీ, వాళ్ళని లేపాలనిపించలేదు. పాపం!..వాళ్ళు ఇంకా నక్సలైట్ల దెబ్బలనుంచి కోలుకోనేలేదు. ఇప్పుడే కాస్తనిద్రపట్టినట్టు వుంది. రాగం తప్పిన గుర్రులు... తడబడుతూ వినబడుతున్నాయి.

రాత్రి ఒంటిగంట కావస్తోంది.

చీరకింద రక్తం కారుతూనే వుంది. వికటించిన గర్భస్రావం.. ఎన్ని గుడ్డలు కుక్కినా, టాబ్లెట్లు మింగినా, ఇంజక్షన్లు ఇచ్చుకున్నా ఆగడం లేదు. రాత్రి పదిగంటలనుంచి అలా ఏకధారగా కారుతూనే వుంది. పడుకున్న పరుపూ, పట్టెమంచం అంతా రక్తంతో తడిసిపోయాయి.

ఊరంతా నిద్రతో ఊగిపోతోంది. వీధి కుక్కలు అక్కడక్కడ భోరుమంటున్నాయి. అమావాస్యతో దెయ్యాల చీకట్లు ఆడుకుంటున్నాయి. ఇంట్లో ఉక్కపోత, ఒంట్లో చీదర చీదర..

ఒక్కసారి లేచి బయటికి రావాలనీ, చల్లని గాలి పీల్చుకోవాలనీ.. అనిపించింది. కానీ, సాధ్యం కాలేదు. పక్క కదిపితేనే ప్రాణం పోతున్నంత బాధ.

"అవునులే! ... ఎవరు చేసుకున్న పాపానికి శిక్ష వారు అనుభవించవలసిందే కదా! అమాయకంగా ప్రేమించినందుకు మోసపోవడమే శిక్ష. విశృంఖలంగా కామించినందుకు గర్భస్రావమే అనివార్యం. సమాజానికి చెప్పుకునే ధైర్యం లేనప్పుడు మరణమే శరణ్యం!! ...' అనుకున్నాను నిర్వేదంగా..!

టీవీ మీద నా చిన్నప్పటి ఫొటో. గర్వంగా నవ్వుతోంది. పట్టు పావడా, చిమ్కీల జడ, కాళ్ళకు గజ్జలు, సొట్టబుగ్గలు, తెల్లని పళ్ళు మెరిసిపోతున్నాయి.

ఆ బట్టలు.. బాపు బతుకమ్మ పండుగకు కుట్టించాడు. అంత చిన్నప్పుడే చేతికి వాచీ కూడా కొనిపెట్టాడు. ఆ వాచీ కోసం ఆరోజు పొద్దున్నే బండిలో పల్లికాయ బస్తాలు వేసుకుని పట్నం బయలుదేరాడు. అమ్మ అయితే ఆ కాళ్ళ పట్టీల కోసం కంసాలి చుట్టూ ఎన్నిసార్లు తిరిగిందని..! అసలు నేను పెద్దమనిషినైన రోజు చూడాలి మా వాళ్ళ హడావుడి. ఈ ప్రపంచంలో తమ కూతురు తప్ప మరెవరూ పెద్దపిల్ల కాలేరన్నంత సంబరం. ఊరు ఊరంతా ఒక్కటి చేశారు.

"నిజంగా నేను మీకు జన్మజన్మలకు ఋణపడి వుంటానమ్మా! ...మీ చల్లని కడుపున నేను ఏకైక పుత్రికగా జన్మించినందుకు గర్వపడుతున్నాను బావూ!!

" కానీ ఇంతకాలం కడుపు కాల్చుకుని పెట్టిన తిండిని నేను జీర్ణించుకోలేకపోయాను. కష్టపడి చదివించిన పై చదువులను తలకెక్కించుకోలేకపోయాను. మీ ఆప్యాయత నన్ను అంధురాలుగా చేసింది. మీ అమాయకత్వం నన్ను అహంకారురాలుగా మార్చింది. మీ జీవితాశయాన్ని నేను నిర్లక్ష్యం చేశాను. చివరికి.. మీరెన్నడూ కలలో కూడా చేయి చేసుకోకుండా, ఎంతో అపురూపంగా పెంచుకున్న 'మీ రేణ' శరీరాన్ని కాటిలో కాల్చుకోవటానికి బహూకరిస్తున్నాను...క్షమించండమ్మా" అనుకుని కాసేపు వెక్కివెక్కి ఏడ్చాను.

స్టార్‌టీవీలో.. ఎవరో ఒక తీగలాంటి శ్వేత జాతీయురాలు తన గొంతెత్తి పాప్‌సాంగ్‌తో పిలుస్తోంది... ఎందరో ఇనుములాంటి నల్లజాతీయులు మత్తుగా ఆమెను చుట్టుముడుతున్నారు. దానికి, ఆమె తట్టుకోలేక అతలాకుతలం అవుతుంటే.. జనం ఆపుకోలేక వెర్రిగా కేకలేస్తున్నారు. ఇదివరకైతే ఈ ప్రోగ్రాం మజాగానే వుండేది. కానీ, ఇప్పుడది వాంతికి వచ్చినట్టుగా వుంది.

రిమోట్ కంట్రోల్‌తో టీవీ ఛానల్ మార్చాను.

ఏదో తమిళ్ ఛానల్‌లో .. అమ్మాయిలూ, అబ్బాయిలూ అర్ధనగ్నంగా... ఒకరినొకరు పట్టుకుని గెంతులేస్తున్నారు.

'ఛీ..ఛీ.. విదేశీ ఛానల్సే కాదు...స్వదేశీ ఛానల్స్ కూడా రంకు వేషాలేస్తున్నాయి. అసలు..ప్రభుత్వ దూరదర్శనే మాయమైపోయింది. అంతా ప్రయివేట్ కేబుల్ కనెక్షన్ల మయం.

వరంగల్ జిల్లాలోని ఒక మారుమూల పల్లెలోనే ఈ పరిస్థితి వుంటే.. ఇక మహానగరాల్లోని స్టార్ మంట యువతను ఏ విధంగా దహించివేస్తోందో..!

"ఎవరి సంగతో ఎందుకు? ... నన్ను దహించివేసింది మాత్రం ఈ ఛానల్స్ సంస్కృతి కాదా?.."

అనుకోగానే ... నాకు వరంగల్ పట్నం కొత్తమజాలూ, గాంధీ మెడికల్ కాలేజీ, నర్సింగ్ స్కూలూ ,ఆసుపత్రీ, ఫ్రెండ్సూ అన్నీ గుర్తొచ్చాయి.

ఏడాదిన్నర కింద...

ఆరోజు అమ్మా బాపు పచ్చళ్ళు మూట కట్టుకుని, నన్ను భద్రంగా బండిలో కూర్చోబెట్టుకుని పట్నంలో వదిలారు. తను చిట్టితల్లి తెల్లనివన్నీ పాలనుకునేంత అమాయకురాలనీ, నోట్లో వేలు పెట్టినా కొరకలేనంత సుకుమారురాలని ఆ హాస్టలు వార్డెన్‌కు మరీమరీ చెప్పి, బలవంతంగా అప్పగించి వచ్చారు. వాళ్ళ ఆశలన్నీ నామీదే. కొడుకైనా... కూతురైనా నేనే కాబట్టి. నేను ఏదో పెద్ద ఉద్యోగం చేసి వారిని ఆదుకుంటానని వారి నమ్మకం. కానీ ఏదీ? .. వాళ్ళ అమాయకమైన ఆశలన్నీ వమ్ము చేశాను కదా!

హాస్టల్లో విద్యార్థినులను బయటికి పోనీకుండా కట్టుదిట్టం చేయటానికి వార్డెన్ ఏర్పాటు చేసిన టీవీలోనే ఆమెకు తెలీకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత బూతు సినిమాలు చేసేవాళ్ళం. బిల్డింగ్ పైనుంచి ఎవరి ఇంటికో వెళ్ళే స్టార్ కేబుల్‌కి చిన్న గుండుపిన్ను గుచ్చితే చాలు.. మా ఆంటినా ద్వారా విదేశీ కార్యక్రమాలు యధేచ్ఛగా దర్శనమిచ్చేవి. చెడుకు ఎంత వేగం, వాడి వుంటాయో దాన్ని చూస్తే గానీ నాకర్థం కాలేదు.

అలా ప్రారంభమైన నా దొంగసినిమాల నగర చీకటి జీవితం, ఆ తర్వాత అనేక మలుపులు తిరిగింది. నాకు అంతవరకు ఏడాదికోసారి కొత్తకొండ జాతరలో పౌరాణిక సినిమాలు చూసిన అనుభవం మాత్రమే వుంది. దానితో...

ఆ అర్ధరాత్రి సినిమాలు నాలో విపరీతమైన అలజడి రేకెత్తించేవి. ఏదో తెలియని మరో మజాలోకం వుందనిపించేది. అదేమిటో ఇంతవరకు నా తల్లిదండ్రులు, నా ఊరు నాకెందుకు చెప్పలేదని కోపం వచ్చేది. దాని గురించి తెలుసుకోవాలనే ఒత్తిడి అధికమయ్యేది. దానికి తోడు నా రూమ్మేట్ రాజమణి నన్నెప్పుడూ ఉద్రేకపరిచేది. ఆ సినిమాల్లోలాగా వాటేసుకుని ముద్దు పెట్టుకునేది. ఛాతీ రాసేది. తొడలు రుద్దేది. దానితో.. ఏదో తెలియని ఆనందం. ఎక్కడికో తేలిపోతున్న అనుభూతి. ఒకరితోనే కాదు. ఎందరితోనైనా ఏకకాలంలో కోరిక తీర్చుకోవచ్చుననే 'స్టార్'బోధన నన్ను నిలువనీయకుండా చేసింది. వెరైటీ కోసం వేట...ఒళ్ళంతా తీపి బాధ. తీర్చుకోవాలనే కసి.

ఒకరోజు వాళ్ళ అన్నయ్య ఆమెను చూడటానికి మా హాస్టల్‌కు వచ్చాడు. అందరం కలిసి కాకతీయలో సినిమాకెళ్ళాం. చీకట్లో అతను అప్పుడప్పుడూ చెయ్యి తగిలించినప్పుడు నరాలు జివ్వుమనేవి. వాళ్ళ వూరు హుజూరాబాద్ కూడా తీసుకెళ్ళాడు. బస్సులో అతని భుజాలు తగులుతుంటే ఎక్కడలేని కొత్త అనుభూతి.. అతను నన్నెప్పుడూ

"బాపూ గీసిన బొమ్మల్లే.. దేవులపల్లి కవితల్లే..! ఎవరైనా .. ఎక్కడైనా చూస్తే ..ఆమె రేణుక" అంటూ పాడుతూ పొగిడేవాడు.

దానితో నా ఒళ్ళంతా పులకరించిపోయేది.

ఆసుపత్రిలో కూడా హౌజ్ సర్జన్ల వేట వుండేది. మంచి ఆరోగ్యంతో అందంగా.. నీట్‌నెస్‌తో నిగనిగలాడుతూ కనిపించేవారు. ఎప్పుడూ వాళ్ళ వద్ద మైసూర్ సాండల్ సోప్ వాసన మత్తెక్కించేది. కర్టన్ల వెనకాల దొరికినప్పుడు, వాష్ బేసిన్ల వద్ద వంగినప్పుడు .. వెనుకాల పట్టుకుని గిల్లేవారు. మా నాన్నలాగ వున్న ఓ యురాలజీ ప్రొఫెసర్ నన్ను ఒకరోజు ఆపరేషన్ థియేటర్లో అమాంతంగా వాటేసుకుని బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆసుపత్రిలో కూడా హౌజ్ సర్జన్ల వేట వుండేది. మంచి ఆరోగ్యంతో అందంగా.. నీట్‌నెస్‌తో నిగనిగలాడుతూ కనిపించేవారు. ఎప్పుడూ వాళ్ళ వద్ద మైసూర్ సాండల్ సోప్ వాసన మత్తెక్కించేది. కర్టన్ల వెనకాల దొరికినప్పుడు, వాష్ బేసిన్ల వద్ద వంగినప్పుడు .. వెనుకాల పట్టుకుని గిల్లేవారు. మా నాన్నలాగ వున్న ఓ యురాలజీ ప్రొఫెసర్ నన్ను ఒకరోజు ఆపరేషన్ థియేటర్లో అమాంతంగా వాటేసుకుని బలవంతంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు.....

మా ఊరు ఆర్ఎంపి డాక్టర్ కొడుకు రమేష్... మా ఆసుపత్రిలోనే సానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సులో చేరాడు. ఒక్కటే వూరు వాళ్ళం కావటంతో ఎక్కువసార్లు కలిసి తిరిగే అవకాశం ఏర్పడింది. దానితో చనువు పెరిగింది. అతని అత్తగారు కట్నం కింద పెట్టిన హీరోహోండా బండి మీద హాయిగా తిరిగేవాళ్ళం. రామప్ప, లక్నవరం, వరంగల్ ఫోర్ట్, వేయిస్థంభాల గుడి, భద్రకాళి చెరువు మా ప్రేమ ప్రదేశాలయ్యాయి. అతనికి పెళ్ళయిన విషయాన్ని... ఇద్దరం ఆ పరిస్థితిలో అంతగా పట్టించుకోలేదు.

వరంగల్‌లో నర్సింగ్ కోర్సు పూర్తయ్యేంతవరకూ ఎంతమంది మగాళ్ళు రెచ్చగొట్టినా, ఎన్ని బూతుచిత్రాలు చూసినా అమ్మ మడి.బిడియం గుర్తుకొచ్చి కాలుమాత్రం జారలేదు. ఆ తర్వాతనే అసలు కథ జరిగింది. రమేష్ మెడికల్ డైరెక్టరేట్‌లో పైరవీ చేసి, లంచం ఇచ్చి మా ఊరి ప్రైమరీ హెల్త్ సెంటర్‌లోనే ఇద్దరికీ పోస్టింగ్ వచ్చేలా చేశాడు.

ఇక ఆరోజు మా అమ్మ,బావుల హడావుడి చూడాలి. నేను తెల్లని యూనిఫామ్‌లో అచ్చం దేవకన్యలా వున్నానని ఒకవైపు ఆనందం. ఊరివాళ్ళ దిష్టి తగులుతుందని మరోవైపు కంగారు..

అలా కొన్నిరోజులు హాయిగానే గడిచిపోయాయి. ఒక్క ఏడాదిలోనే వూర్లో ఎన్నో మార్పులు వచ్చాయి. టీవీలు, కేబుల్ కనెక్షన్లు వచ్చాయి. హాస్టల్లో స్టార్ ప్రోగ్రామ్స్ చూసుకుంటూ... ఒళ్ళంతా దిండ్లకేసి రుద్దుకుంటూ... స్వయం తృప్తి పొందటం బాగా అలవాటైంది. అందుకే ఇంట్లో కూడా వెంటనే టీవీ పెట్టించాను. కానీ,.. ఇక్కడ సొంతవూరు కావటంతో ధైర్యం పెరిగింది. గైనకాలజీకి సంబంధించిన నాలెడ్జి ఇదివరకే వుంది. కడుపులను తీసివేసే అనుభవ కొత్తగా వచ్చింది... కాబట్టి ఇంతకుముందు పట్నంలో సెక్స్ విషయంలో వున్న భయం, బిడియం తొలగిపోయాయి. నిర్లక్ష్యం ఆవరించింది.

దీనికి తోడు ...' నా భార్యను వదిలేశాను. నిన్ను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను. ఈలోగా నా అవసరం చూడవా ప్లీజ్' అంటూ ప్రతిరోజు వెంటపడి, వేడుకునే రమేష్ కోరికను కాదనలేకపోయాను.

ఇక ఆసుపత్రే మాకు పడకగది అయిపోయింది. అయితే...

ఈలోగా రమేష్ భార్య నక్సలైట్లకు ఫిర్యాదు చేసింది. వాళ్ళు మొన్న రాత్రి ఊరు మధ్యలో ప్రజాకోర్టుపెట్టి, మా ఇద్దరినే కాకుండా... నా ప్రియమైన అమ్మా బాపులను కూడా బాగా కొట్టారు. వాళ్ళకు నేను ఏమీ చేయలేకపోయినా, వాళ్ళు నన్ను అపురూపంగా పెంచుకున్నందుకు..నేను ఇచ్చిన ఈ బహుమానానికి, అవమానానికి వాళ్ళెంత కుంగిపోయారో!!!

"మళ్ళీ ఎన్నడూ కలిసి కనిపించవద్దని, ఒక్కదగ్గర ఉద్యోగాలు కూడా చేయవద్దని" అన్నలు హెచ్చరించి.. పీవులంతా పగులకొట్టి... రమేష్ భార్యను అతని ఇంట్లో వదిలేసి వెళ్ళారు.

కానీ అప్పటికే రమేష్‌తో అన్నీ అయిపోయాయి. రెండునెలల గర్భం కూడా వచ్చింది. ఏం చేయాలో తోచలేదు. నా ఆప్తమిత్రురాలు రాజమణిని సంప్రదించాను.

ఈరోజే.. పొద్దున ఆమెవచ్చి..మా హెల్త్ సెంటర్‌లోనే నాకు డీఎండ్‌సి చేసి వెళ్ళిపోయింది. అన్నల భయంతో ఆమె అతి రహస్యంగా, కంగారుగా అబార్షన్ చేయటం వల్ల.. గర్భ సంచిలో ఏదో అనుకోని గాయం అయినట్టు వుంది. ఏకధారగా రక్తస్రావం అవుతూనే వుంది. ఎంత ప్రయత్నించినా ఆగదు. నాకు తెలిసిన వైద్యం అంతా చేసుకున్నాను. ఇక ఓపిక లేక... అలాగే వదిలేశాను.

నా మూలంగా ఎన్నో అవమానాలకు గురైన నా ప్రియమైన తల్లిదండ్రుల పాదాలను చివరిసారిగా స్పృశించాలనుకున్నాను. కానీ ఈ తుది ఘడియల్లో అది సాధ్యం కాదనిపించింది. చనిపోయే ముందు టీవీలు నాలుగై భూతాల్లా కనిపించాయి.

కోపంతో నవనాడులు తెగిన శబ్దం.

చివరికి శక్తినంతా కూడగట్టుకుని బల్లమీది నీళ్ళ గ్లాసునెత్తి... బలంగ విసిరాను.

భళ్ళున టీవీ పగిలిన శబ్దం!. ..

ఇక అదే నాకు ఆఖరి శబ్దమైంది.

●